

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.42

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.42, కనిష్టంగా రూ.34 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,225 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.2°/20.7°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మాజీ సైనికులకు ఉచిత న్యాయ సేవలు



లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ సైనికులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయసేవలు అందించనున్నట్లు జిల్లా జడ్జి భీమారావు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కోవూరు నగర్‌లోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. పెన్షన్, భూ వివాదాలు, కుటుంబ తదితర అన్ని న్యాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రాజశేఖర్, జిల్లా సైనిక సంక్షమ అధికారి పి.తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో 'డిజైన్ థింకింగ్' కోర్సు ప్రారంభం



కోర్సును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో మూడో వ్యాల్యూ యాడెడ్ కోర్సు 'డిజైన్ థింకింగ్ సర్టిఫికెట్ కోర్సు'ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం ప్రారంభించారు. నూతన కోర్సు మానవ కేంద్రీకృత డిజైన్ విధానాలను నేర్పిస్తుంది. విద్య, వ్యాపారం, వ్యవసాయం, సహజ అభివృద్ధి వంటి విభిన్న రంగాల్లో వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినూత్న పరిష్కారాలు అందించే సరళమైన, శక్తివంతమైన పద్ధతులు నేర్చుకోవడానికి ఈ కోర్సు దోహదం చేస్తుంది. కార్యక్రమంలో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం సీఈఓ సి.చంద్రమౌళి, కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణుడు, డాక్టర్ పి.జ్యోతి, బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం: మలుగూరు గురుకుల పాఠశాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం పాఠశాలలో వంటశాల నిర్వహణ, వంటకాల తయారీ, తాగునీటి సదుపాయం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులు, వంటశాల పరిస్థితి, పరిశుభ్రత పరిశీలించారు. అలాగే డీఎంహెచ్ఓ, ఎంపీడీఓ సరస్వతిలకు పలు సూచనలిచ్చారు. తరచూ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ హుసేన్

ధర్మవరం అర్బన్: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరగనున్న 15వ జాతీయస్థాయి జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ధర్మవరానికి చెందిన షేక్ మహబూబ్ బాషా, వనం నవీన్‌కుమార్ ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. వీరు ఈ ఏడాది ఏప్రిల్‌లో ధర్మవరంలో జరిగిన 15వ రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ పోటీలలో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి మంచి ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. అలాగే రాష్ట్ర హాకీ జట్టుకు కోచ్‌గా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్ హుసేన్ వ్యవహరిస్తున్నారని తెలిపారు.

మురిసిన మువ్వన్నెలు



జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్ తదితరులు



స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా పరేడ్ పరిశీలన చేస్తున్న మంత్రి సవిత, ఎస్పీ రత్న



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



దేశభక్తిని చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



పరేడ్‌లో పోలీసు బ్యాండ్ సభ్యులు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న పోలీసు జాగిలాలు



వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు



వజ్ర శకటాన్ని ప్రదర్శిస్తున్న పోలీసులు

- వాడవాడలా 79వ స్వాతంత్య్ర దినోత్సవం
- పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ మైదానంలో అంబరాన్నంటిన సంబరాలు
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి సవిత
- దేశభక్తిని చాటిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసా పత్రాల ప్రదానం

ప్రశాంతి నిలయం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. వాడవాడలా స్వాతంత్య్ర వేడుకలు వైభవంగా జరిగాయి. భారత స్వాతంత్య్ర సంగ్రామం, త్యాగధనుల పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలన్నింటిపై జాతీయ జెండాను ఎగురవేశారు.

వైభవంగా స్వాతంత్య్ర వేడుకలు..

పుట్టపర్తి శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. మంత్రికి కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసులు, సాయుధ దళాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పలు పాఠశాలల విద్యార్థులు జాతీయ భావాన్ని చాటుతూ మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. పోలీసు జాగిలాలు మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేసి వందనం చేశాయి. జాగిలాలు చేసిన పలు సాహస విన్యాసాలు అహూతులను అబ్బురపరిచాయి. ఏడాది కాలంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ పలు శాఖలు శకటాలను ప్రదర్శించాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన 31 మంది వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులకు సేవా పురస్కారాలు, 251 మంది అధికారులకు ప్రశంసా పత్రాలు మంత్రి సవిత అందజేశారు.

స్టాళ్ల సందర్శన..

వివిధ శాఖల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలను ప్రదర్శిస్తూ ఏర్పాటు చేసిన 11 స్టాళ్లను మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ స్టాల్‌కు మొదటి బహుమతి, అటవీ శాఖ స్టాల్‌కు రెండో బహుమతి, పశుసంవర్ధక శాఖ స్టాల్‌కు మూడో బహుమతిని అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను మంత్రి సవిత సన్మానించారు.

పారదర్శక పాలనకు కట్టుబడి ఉన్నాం: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

అవినీతి రహిత, వివక్ష లేని పారదర్శక పాలనను ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం పుట్టపర్తి శిరసాని హిల్స్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి సర్కార్ పాలన సాగిస్తోందన్నారు. పీ-4 విధానం ద్వారా పేదరికం లేకుండా రూపుమాపేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం కుటుంబాల సహకారంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే లక్ష్యంతో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించామని, శుక్రవారం నుంచే ఈ పథకం అందుబాటులోకి వచ్చిందన్నారు.

- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలతో పాటు ఎన్ఆర్ఈజీఎస్, ఎన్టీఆర్ వైద్య సేవలు ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చామన్నారు. 'దీపం-2.0' పథకం కింద 3,43,399 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



దేశ సమైక్యతను చాటేలా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులు



పరేడ్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్



ధర్మవరం జీవనజ్యోతి విద్యార్థుల నృత్య ప్రదర్శన



దేశభక్తి గేయానికి గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థుల నృత్యరూపకం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్య్ర వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశ భక్తిని చాటాయి. పోలీసుల జాగిలాలు చేసిన విన్యాసాలు ఔరా అనిపించాయి. వేడుకల్లో భాగంగా జీవనజ్యోతి (ధర్మవరం) పాఠశాల విద్యార్థులు దేశభక్తిని చాటే విధంగా 'వందేమాతరం' పాటకు చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది, కేజీబీవీ(జగరాజుపల్లి) విద్యార్థులు 'గలగల పారే గోదావరి', గిరిజన సంక్షేమ పాఠశాల (కదిరి) విద్యార్థుల పూరియా ఘడేతీ, గిరిజన సంక్షేమ పాఠశాల (గోరంట్ల) విద్యార్థుల 'మారోవేష్ పురోదేవ్' నృత్యరూపకాలు అలరించాయి. డైట్ కాలేజ్ (బుక్కపట్నం) విద్యార్థులు 'నింగి వంగి నేల పొంగి' దేశ భక్తి గేయ ప్రదర్శన ఆకట్టుకుంది. పరేడ్ మైదానం చుట్టూ కట్టిన మూడురంగుల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం

- రిగ్గింగ్, దొంగ ఓట్లతో గెలిచి సంబరాలు చేసుకుంటారా?
- టీడీపీ నేతల దిగజారుడు రాజకీయంపై మండిపడిన ఈరలక్కప్ప



మీడియాతో మాట్లాడుతున్న ఈరలక్కప్ప

మడకశిర రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో మీడియాతో మాట్లాడారు. అధికారం అండతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు రిగ్గింగులు, దొంగ ఓట్లతో ఎన్నికలనే అపహాస్యం చేశారన్నారు. దౌర్జన్యాలు, బెదిరింపులతో స్థానికులను ఓటు వేయకుండా అడ్డుకుని, ఇతర ప్రాంతాల ఓటర్లతో రిగ్గింగ్ చేసుకుని అదే పెద్ద గెలుపని టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. తనకు ఎంతో రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే సీఎం చంద్రబాబు.. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో దిగజారుడు రాజకీయం చేశారన్నారు. తమను ఓటు వేయనీయకుండా పోలీసులు అడ్డుకున్నారని... తాము ఓటే వేయకుండా జెడ్పీటీసీలు ఎలా గెలిచారని ఆయా జెడ్పీటీసీ స్థానాల పరిధిలోని ఓటర్లే ప్రశ్నిస్తున్నారన్నారు. టీడీపీ నేతలు ఇతర ప్రాంతాల వారితో దొంగ ఓట్లు వేయిస్తున్నా.. పోలీసులు, అధికారులు కనీసం అడ్డుచెప్పలేదన్నారు. తమకు ఓటు వేయడానికి అవకాశం కల్పించాలని స్థానికులు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్నా... అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని తీవ్రం ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జెడ్పీటీసీ ఉప ఎన్నికలు నిర్వహించి ఉంటే టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కేవి కావన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను తగ్గించేందుకు టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ఉపయోగం లేదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, కూటమి నేతల దౌర్జన్యాలు, దుర్మార్గాలు ఎన్నోరోజులు సాగవన్నారు. రానున్న రోజుల్లో ఈ దుర్మార్గులకు తప్పకుండా బుద్ధి చెప్పి తీరుతారన్నారు.

మరీ ఇంత స్వాతంత్య్రమా?

- స్వాతంత్య్ర వేడుకల్లో గాంధీ చిత్రం పక్కనే టీడీపీ నేత తండ్రి ఫొటో
- దండలు వేసి పూజలు చేయించిన టీడీపీ నేత
- పలగలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘటన



గాంధీజీ చిత్రపటం పక్కనే టీడీపీ నేత తండ్రి ఫొటో ఉంచి పూజలు నిర్వహించిన దృశ్యం

చిలమత్తూరు: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి టీడీపీ నేతల ఆగడాలకు, దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. తమ ప్రభుత్వంలో తామేం చేసినా చెల్లుతుందన్నట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా చిలమత్తూరుకు చెందిన టీడీపీ నేత సురేంద్ర అత్యుత్సాహం ప్రదర్శించాడు. శుక్రవారం పలగలపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో గాంధీ చిత్రపటం పక్కనే మరణించిన తన తండ్రి ఫొటో ఉంచాడు. తన తండ్రి పాఠశాలకు స్థలం ఇచ్చారని, తన తండ్రి ఫొటోకు కూడా పూజలు చేయాలని ఆదేశాలిచ్చాడు. దీంతో ఉపాధ్యాయురాలు చేసేది లేక గాంధీజీ చిత్రపటం పక్కనే టీడీపీ నేత తండ్రి ఫొటో ఉంచి పూజలు నిర్వహించారు. దీనిపై ఉపాధ్యాయురాలిని వివరణ కోరగా... ''ఆయన (టీడీపీ నేత) తన తండ్రి ఫొటో కూడా పెట్టాలని ఆదేశించారు..అందుకే తప్పక పెట్టాల్సి వచ్చింది'' అని సమాధానం ఇచ్చారు. ఈ ఘటనపై ఎంఈఓ -1 హనుమంతరెడ్డి మాట్లాడుతూ... అలా చేయడం ముమ్మాటికీ తప్పేనన్నారు. ఉపాధ్యాయురాలిని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మొదటి బహుమతి





సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచిన వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్ శాఖ శకటాలు

రెండవ బహుమతి



రెండో స్థానంలో నిలిచిన అన్నా క్యాంటీన్ శకటం

సేవలకు ప్రశంస



సెరికల్చర్ జేడీ శోభారాణికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ప్రశాంతి నిలయం: జిల్లా కేంద్ర మైన పుట్టపర్తిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం సంబరంగా జరిగాయి. ఇందులో భాగంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన 31 మంది జిల్లాస్థాయి అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు, 251 మంది అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత వారికి పురస్కారాలను అందించారు.



రాజశేఖర్‌రెడ్డి, గ్రౌండ్‌వాటర్ | రాజు, మేనేజర్, సివిల్ సప్లయిస్ | ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ | మధుసూదన, డీసీహెచ్‌ఎస్ | అన్నపూర్ణ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ | పద్మావతి, మెప్మా పీడీ

సంజీవయ్య, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి | విజయ్‌భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి | సంపత్ కుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ | వెంకట సుబ్బయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ | నాగకుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ | నరసింహరాజు, దేవదాయశాఖాధికారి



కరుణసాగర్‌రెడ్డి, ఆర్‌టీఓ | కేఎన్ నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ | ఉదయ్ భాస్కర్, స్పోర్ట్స్ చీఫ్ కోచ్ | వేణుగోపాల్‌రెడ్డి, డీపీఆర్‌ఓ | మాధవనాయుడు, జిల్లా ఫైర్ ఆఫీసర్ | మధుసూదన్, ఏపీఎస్‌ఆర్‌టీసీ అధికారి | ప్రమీల, ఐసీడీఎస్ పీడీ | ప్రమోద్, ధర్మవరం మున్సిపల్ కమిషనర్

కిరణ్ కుమార్, కదిరి మున్సిపల్ కమిషనర్ | క్రాంతికుమార్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ | జగన్నాథ్, మడకశిర మున్సిపల్ కమిషనర్ | నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ | నరసింగప్ప, పెనుకొండ డీఎస్పీ | ఆదినారాయణ, డీఎస్పీ | నారాయణరెడ్డి, కదిరిటౌన్ సీఐ | ప్రభాకర్, ధర్మవరం రూరల్ సీఐ

కృష్ణవేణి, తాడిమర్రి ఎస్ఐ | నరసింహరాజు, ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ | ప్రదీప్‌సింగ్, ఆర్ఎస్ఐ | పుల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ | సబియా, జూనియర్ అసిస్టెంట్ | రాజేశ్, కానిస్టేబుల్ | శివానంద, మెడికల్ ఆఫీసర్ | మంజుల, స్టాఫ్‌నర్స్

సంహిత, సీఎస్‌డీటీ | ఉదయ్‌కుమార్ నాయుడు, ఏఎంవీఐ | విజయ్‌కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ | ఉన్నం హరికృష్ణ, ఎక్సైజ్ సీఐ | ఓం సింహా, ఎక్సైజ్ ఎస్ఐ | అమ్మినేని కేశప్ప, సబ్ ట్రెజరీ ఆఫీసర్ | అబ్దుల్ హసిబ్, కలెక్టరేట్ ఫొటోగ్రాఫర్ | శారద, పంచాయతీ సెక్రటరీ

అభివృద్ధి పట్టాలపై గుంతకల్లు డివిజన్



ఆర్‌పీఎఫ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్‌ఎం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

- పంద్రాగస్ట్ వేడుకల్లో డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: ప్రయాణికుల భద్రత, సరుకు రవాణా తదితర అన్ని విభాగాల్లో గుంతకల్లు డివిజన్ ఆల్ రౌండ్ ప్రతిభతో దూసుకెళ్తోందని రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా పేర్కొన్నారు. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి ఆర్‌పీఎఫ్‌ల నుంచి డీఆర్‌ఎం గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గడచిన నాలుగు నెలల్లో 15 మిలియన్ల ప్రయాణికులు టిక్కెట్ల కొనుగోలు ద్వారా రూ.361 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. దాదాపు 48 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడం ద్వారా మరో రూ.8 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. డివిజన్‌లోని పాణ్యం–బుగ్గనపల్లి స్టేషన్ల మధ్య డబులింగ్ రైలు మార్గం పనులు పూర్తి చేశామన్నారు. అమృత్ స్టేషన్ స్కీమ్ కింద డివిజన్ పరిధిలోని 17 రైల్వేస్టేషన్లలో తొలి విడత కింద రూ.234 కోట్లు, రెండో విడత కింద రూ.358 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం యూ.సుధాకర్, సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎస్ ప్రసాద్, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ ఆకాష్ జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం..

ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని గుంతకల్లు రైల్వే జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ ఏడాది విశేష సేవలు అందించిన జీఆర్‌పీలకు అవార్డులను ప్రదానం చేశారు. డీఎస్పీ శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

దగ్గుపాటి వర్సెస్ వైకుంఠం

- తారస్థాయికి విభేదాలు
- పరస్పర ఆరోపణలతో తగ్గేదేలే అంటున్న నేతలు
- బజారునపడ్డ అనంతపురం అర్బన్ టీడీపీ రాజకీయం



మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆ పార్టీ పరువు బజారున పడినట్టయింది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మధ్య కొనసాగుతున్న ఈ రాజకీయ వైరం తారస్థాయికి చేరింది. స్వపక్షంలోనే విపక్షం అన్నట్టు కొనసాగుతున్న ఈ ఆరోపణలు చివరకు రచ్చకెక్కాయి. ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలకు దిగి పార్టీ పరువు తీస్తున్నారని తెలుగు 'తమ్ముళ్లు' వాపోతున్నారు.

మీలా తాళిబొట్లు తెంచలేదు..

మీలాగా కొంతమంది తాళిబొట్లు తాను తెంచలేదని, ఎవరిమధ్యా గొడవలు పెట్టలేదని ప్రభాకర్ చౌదరిపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు సంధించారు. 'నాకు టికెట్ వచ్చినప్పటి నుంచి ఇబ్బందులు పెడుతున్నారు.. చాలా సంతోషం.. నాపై విచారణ చేస్తే క్లీన్‌చిట్ వస్తుంది. నేను కొందరిలాగా చైర్మన్‌గా ఉంటూ ఆస్తులు సంపాదించుకోలేదు, నేను ఇక్కడ స్టాండ్ అవుతాననే ఆందోళనతోనే ఇదంతా చేస్తున్నారు. చివరకు నా బర్త్‌డే రోజు ఫ్లెక్సీలు చూసి ఓర్వలేక పోయారు. గతంలో రహంతుల్లా ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. మహాలక్ష్మి శ్రీనివాస్‌ను ఎవరు ఓడించారో అందరికీ తెలుసు. గతంలో ఆయన బీ ఫామ్ ఎలా తెచ్చుకున్నారో కూడా తెలుసు' అని విమర్శించారు.

నీ బండారం బయటపెడతా..

దగ్గుపాటి వ్యాఖ్యలకు ప్రభాకర్ చౌదరి దీటుగా స్పందించారు. 'ఇప్పుడు బయటపెట్టింది కొన్ని మాత్రమే.. ఇంకా నా దగ్గర చాలా ఆధారాలున్నాయి. మందుతాగి మహిళలతో ఎలా మాట్లాడారో తెలుసు. రాప్తాడు ప్రసాద్‌రెడ్డి హత్యకేసులో ముద్దాయి ఎవరో తెలుసు. రాప్తాడుకు చెందిన వారు నీ ప్రైవేటు సైన్యంగా ఉన్నారు. మైనార్టీ అమ్మాయి షాపు ఆక్రమణలో అక్కడున్నది నీ మనిషి కాదా? అమ్మాయిని ఎలా బెదిరించావో తెలుసు. రాత్రి మందుతాగి తెలుగు యువత నాయకుణ్ని ఎలా మాట్లాడావో తెలుసు. ఇవన్నీ బయటపెడతా. రామాంజనేయులు అనే వ్యక్తికి చెందిన 92 సెంట్ల భూమిని మీరు కబ్జా చేస్తే ఎస్పీకి ఫిర్యాదు చేసింది వాస్తవం కాదా? నీ వ్యవహారం వల్ల ఉమ్మడి జిల్లాలోని 14 నియోజక వర్గాల్లో ప్రభావం పడుతోంది' అని అన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 1,200 గ్రాముల గంజాయి స్వాధీనం

కదిరి టౌన్: గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ ఖాజావలీ, ఇరానీ కాలనీ వాసి శియ ఖైబర్ అబ్బాస్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి 1,200 గ్రాముల గంజాయి, రూ.1,100 నగదు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల రైల్వే గేట్ సమీపంలో కందికుంట నారాయణమ్మ కాలనీ వైపు రస్తా వద్ద కొంతమంది గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. షేక్ ఖాజావలీ, శియ ఖైబర్ పట్టుబడడంతో వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు. వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో కదిరి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ వివరాల మేరకు.. కళ్యాణదుర్గం రూరల్ మండలంలోని దురదకుంటకు చెందిన కృష్ణమూర్తి (34) బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పెనుకొండ పరిధిలోని హరిపురం జంక్షన్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తి అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సుస్మిత ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి



డీసీఓ విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: 'మండల పరిధిలోని మలుగూరు పంచాయతీ నందమూరినగర్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఒకేసారి 10 మందికిపైగా విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. వారికి వెంటనే మెరుగైన వైద్య సేవలందించాలి' అని వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో సోమందేపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటన మరువకముందే హిందూపురంలో ఒకేసారి పదిమందిపైగా విష జ్వరాలు వచ్చి ఆస్పత్రి పాలవడం బాధాకరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్‌లను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం డీసీఓ జయలక్ష్మికి వినతిపత్రం అందించారు. జయలక్ష్మి మాట్లాడుతూ ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ కవి ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు–సంప్రదాయాలు' పుస్తకాన్ని అరసం (అభ్యుదయ రచయితల సంఘం) ఆధ్వర్యంలో ఈనెల 17న ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తన్నీరు నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగే కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.

ఆకట్టుకున్న 'అమర భారతం'



అమర భారతం నాటికను ప్రదర్శిస్తున్న క్యాంపస్ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు దేశ స్వాతంత్య్ర సంగ్రామ ఘట్టాలను వివరిస్తూ 'అమర భారతం' పేరుతో ప్రదర్శించిన నాటిక అందరికీ ఆకట్టుకుంది. స్వాతంత్య్ర సంగ్రామంలో నాటి దేశ నాయకులు కనబరచిన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సందేశమిచ్చారు.



నాటికలో ఓ ఘట్టం